క్లుప్తంగా

గంగమ్మ గెరిగె ఊరేగింపు



నింద్రలో గెరిగెను ఊరేగిస్తున్న గ్రామస్తులు

నింద్ర: మండల కేంద్రంలో బుధవారం గంగమ్మ జాతర ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో గెరిగెను ఊరేగించారు. ఉదయం గంగమ్మకు అంబలి పోశారు. రాత్రి గ్రామంలో గంగమ్మను ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం గంగమ్మ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

వైభవంగా కలశపూజలు



విశేషాలంకరణలో వన్నూరమ్మ

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం శ్రీ వన్నూరమ్మ ఆలయంలో చండీసప్తశతి హోమ పూజల్లో భాగంగా బుధవారం కలశ పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చేపట్టిన అలంకరణలు భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఆవరణలో హోమ పూజల సందర్భంగా ఏర్పాటు చేసిక హోమ గుండాల వద్ద కలశపూజ నిర్వహించారు.ఈ పూజలను బ్రహ్మశ్రీ తిప్పావఝ్జుల శ్రీకాంత్‌శర్మ, నిబణపూడి ఉదయకుమార్ శర్మ, పురాణం దుర్గాప్రసాద్ శర్మ, నవీన్‌కుమార్ శర్మ, మహేష్ శర్మ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూజారి వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

గర్భిణులకు రక్త పరీక్షలు తప్పనిసరి



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : మండలంలోని గర్భిణులు వైద్య పరీక్షలు చేయకముందే రక్త పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం వెంగళరాజుకుప్పం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు రక్త పరీక్షలతో పాటు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పండ్లరసం, మజ్జిగ, ఓఆర్‌ఎస్, నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో బయటకు వస్తే గొడుగు సహాయంతో రావాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకుంటే మాతాశిశు మరణాలు జరగవన్నారు. అనంతరం గర్భిణులకు రక్తపరీక్షలు చేసి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారంతో గర్భిణులు

నగరి : స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన గర్భిణులకు మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా అందించే పౌష్టికాహారం పంపిణీ బుధవారం కూడా కొనసాగింది. గర్భిణులతోపాటు వారి వెంట వచ్చిన చిన్నారులకు కూడా పౌష్టికాహారం అందించారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఏడాది వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ బదిలీల చట్టంపై విజయవాడలో రాష్ట్ర పాఠశాల విద్య సర్వీసెస్ జేడీ మువ్వా రామలింగం సూచనలు కోరినట్లు వివరించారు. ఆపస్ సంఘం తరపున జేడీని కలిసి బదిలీ యాక్ట్‌కు సంబంధించిన సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న బదిలీల యాక్ట్‌ను రూపొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సిఫార్సు బదిలీలను అంగీకరించకూడదని, ప్రతి వేసవి సెలవుల్లో కచ్చితంగా బదిలీల కసరత్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కనీసం రెండు సంవత్సరాలు, గరిష్ఠంగా ఆరేళ్లు పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. పాఠశాల కేటగిరీల్లో మండల కేంద్రాలను ప్రత్యేక కేటగిరీలుగా గుర్తించాలని చెప్పారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీలో 70 శాతం వైకల్యం ఉన్న వారికి మాత్రమే అనుమతించాలన్నారు. మిగిలిన వారికి స్పెషల్ కేటగిరీ పాయింట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నేతలు సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల పొద్దు తిరుగుతుంది

సంప్రదాయ పంటల సాగు.. ఏటా తగ్గుతున్న దిగుబడి.. అప్పులు చివరకు మిగిలేది తిప్పలే.. ఈ విధానం వీడి వ్యాపార పంటలపై దృష్టి సారిస్తే చేనుకు చేవ.. రైతుకు రొక్కం దక్కుతుందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలోనూ పొద్దుతిరుగుడు సాగు చేస్తే లాభాల పంట పండుతుందని చెబుతున్నారు.

- వేసవిలో పొద్దుతిరుగుడు సాగుతో అధిక రాబడి
- మూడు నెలల్లోనే దిగుబడి



బాలక్రిష్టాపురం సమీపంలో ఓ రైతు సాగు చేసిన పొద్దుతిరుగుడు పంట

పాలసముద్రం : నీటి వసతి ఉన్న రైతులు ఖరీఫ్, రబీలోనే కాకుండా వేసవిలోనూ పొద్దుతిరుగుడు సాగు చేసుకోవచ్చు మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ సూచించారు. లాభాల పొద్దుతిరుగుడు పంట సాగుపై ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అవి ఆయన మాటల్లోనే.. రబీలో వరి సాగు చేసుకోని రైతుల నీటి సదుపాయం ఉంటే వేసవిలో పొద్దుతిరుగుడు సాగు చేస్తే 70 నుంచి 90 రోజుల్లో దిగుబడి సాధించ వచ్చు. నల్ల, ఎర్ర నేలలు, ఎర్రమట్ట భూములు ఈ పంట సాగుకు అనుకూలమైనవి. చౌడు నేలల్లో అంతగా దిగుబడి రాదు.

సాగుకు అనుకూలమైన విత్తన రకాలివీ..

పొద్దుతిరుగుడు సాగుకు మోర్డన్, సీఓ-2 వంటి స్వల్పకాలిక రకాలు, ఏపీఎస్‌హెచ్ 11, కేబీఎస్‌హెచ్-1, ఏహెచ్-3425 తదితర మధ్యకాలిక రకాలతోపాటు ఎంఎస్‌ఎఫ్-8.17, పీఏసీ-36, 1091, సన్‌బ్రెడ్-279, సన్‌జీవ్-85, సన్‌రైజ్-1,2 తదితర ప్రైవేటు రకాలు అనువుగా ఉంటాయి. విత్తనాలను అధీకృత సంస్థల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. హైబ్రీడ్ రకాల నుంచి తీసుకున్న ఎఫ్-2 విత్తనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. పొద్దుతిరుగుడు ఆరుతడి పంటగా విత్తే ముందుగా విత్తనాన్ని 24 గంటలు పాటు నీటిలో లేదా 0.5 కాల్షియం క్లోరైడ్ ద్రావణంలో నారబెట్టినట్లయితే మొక్క బాగా నిలదొక్కుకుంటుంది. విత్తనం ద్వారా వ్యాప్తి చెందే శిలీంద్ర తెగుళ్ల నివారణకు కిలో విత్తనాలకు 3 గ్రాముల థైరమ్, మాంకోజెబ్, కాప్టాన్, కార్బండజిమ్ లేదా 5 గ్రాములు ఇమిడాక్లోప్రిడ్ పట్టించి శుద్ధి చేసుకోవాలి.

విత్తే విధానం

ఎకరానికి సంకరజాతి రకాలైతే 20-24 కిలోలు, నాటు రకాలైతే 24 నుంచి 32 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. తేలిక భూముల్లో వరుసల వధ్య 45 సెంటీ మీటర్లు మొక్క మొక్కకు మధ్య 20 సెంటీమీటర్లు దూరాన్ని పాటిస్తూ గొర్రుతో విత్తనాలు వేసుకోవాలి. మధ్య రకం నేలల్లో ఈ దూరం 40-25 సెంటీమీటర్లుగా ఉండాలి. బరువు నేలల్లో 60-30 సెంటీమీటర్లుగా ఉండాలి. ఎక్కువగా ఉన్న మొక్కల్ని మొలిచిన 15 రోజుల లోపు తీసివేయాలి. ఏటవాలు భూముల్లో పొద్దుతిరుగుడు వేస్తే వారు కాంటూరు సేద్యం చేసుకోవాలి. మురుసీరు బయటికి పోయే సౌకర్యాన్ని కల్పించాలి.

ఎరువులు, నీటి యజమాన్య పద్ధతులు

ఆఖరి దుక్కిలో ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పశువుల ఎరువు వేసి బాగా కలియదున్నాలి. విత్తేటప్పుడు 30 కిలోల నత్రజని, 90 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్ ఎరువులు వేయాలి. విత్తిన తర్వాత 35నుంచి 55 రోజులకు 50 కిలోల చొప్పున నత్రజనిని అందించే ఎరువు వేసుకోవాలి. పంట మొగ్గ తొడిగే సమయంలో, పూలు విచ్చే సమయంలో, గింజ కట్టే సమయంలో నీడి ఎద్దడి లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. అదే సమయంలో పంటకు నీరు ఎక్కువ కాకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే ఆకుమచ్చ తెగళ్లు సోకుతాయి. గింజ కట్టే సమయంలో బెట్ట పరిస్థితులు ఏర్పడితే దిగుబడి తగ్గుతుంది. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే పొద్దుతిరుగుడు పంట సాగులో అధిక దిగుబడులతోపాటు లాభాలు ఆర్జించవచ్చు. సంప్రదాయ పంటల సాగు కన్నా, వ్యాపార పంటల సాగు రైతులకు లాభదాయకం.

అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు



భద్రతా బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సీఐ మారుతీశంకర్

గంగాధరనెల్లూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ రోజు గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జీడీ నెల్లూరు సీఐ మారుతీ శంకర్ హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ప్రతిరోజు గస్తీ నిర్వహిస్తున్నామని కౌంటింగ్ రోజున పోలీస్ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పాటు చేసిన రూట్‌లో మొబైల్ వాహనాల ద్వారా గస్తీ నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. పల్లెల్లో ప్రశాంత వాతావరణం ఉండాలని ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సాయుధ బలగాలతో గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

మండల మీట్ వాయిదా

నింద్ర: మండలంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ భవానీ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు అందుబాటులో లేని కారణంగా సమావేశం నిర్వహించలేదన్నారు. సమావేశం తేదీ తరువాత ప్రకటించనున్నట్లు తెలిపారు.

సత్యవేడులో జాతర సందడి

సత్యవేడు: గంగమ్మ జాతర బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. రజకుల ఇంట్లో మహిషాసురమర్దినిగా గంగమ్మ రూపాన్ని బంకమన్నుతో తయారు చేశారు. అమ్మవారికి విశేషపూల అలంకరణతో పచ్చలహారం, కాసుల హారం మామిడి మాల, సూర్యచంద్రకళ కాళ్లగజ్జలు ముక్కుపుడక, త్రిశూలం, వెండికిరీటం తొడిగారు. తరువాత తప్పెట్లు, డప్పులు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ అమ్మవారిని రజకులు తలపై మోస్తూ పట్టణంలోని గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, పల్లాపువీధి, జయరాంబత్తుడు వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి గండుదీపం, వేపచీర మొక్కులు చెల్లించారు. ఊరేగింపు గురువారం తెల్లవారు జాము వరకు సాగి నడివీధి గంగమ్మ వద్ద పర్ణశాలలో అమ్మవారు కొలువుదీరనున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు.

సారె సమర్పణ

జాతర సందర్భంగా సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ కె.రామచంద్రా రెడ్డి, బాల నాగాలమ్మ ఆలయ ధర్మకర్త పి.రేవతమ్మ, ఆలయ భక్త బృందం వేర్వేరుగా సత్యవేడు గంగమ్మకు పట్టువస్త్రాలతో కూడిన సారెను సమర్పించారు.

వైభవంగా గంగమ్మ జాతర



పాదిరికుప్పంలో నడివీధిలో కొలువుదీరిన గంగమ్మ

కార్వేటినగరం: మండలంలోని పలు గ్రామాల్లో అమ్మలుగన్న అమ్మ నడవీధి గంగమ్మ జాతర సంబరాలను మంగళవారం రాత్రి అత్యంత వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా అమ్మవారు ఊరేగుతూ బుధవారం ఆలయానికి చేరుకున్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారిని జలధికి తరలించడంతో జాతర ముగిసింది. కార్వేటినగరం పెద్ద దళితవాడ, పాదిరికుప్పం, కేఎంపురం, గంగమాంబాపురం గ్రామాల్లో నడవీధి గంగమ్మ జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొక్కులు ఉన్న భక్తులు ఇంటింటా పొంగళ్లు వండి, పిండిదీపాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకోదండరాముని ఆస్థానం



సంకీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో బుధవారం ఉదయం శ్రీకోదండరామస్వామివారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవమూర్తులను శ్రీకోదండ రామస్వామి వారి ఆలయం నుంచి అన్నమాచార్య కళామందిరానికి వేంచేపు చేశారు. అన్నమయ్యను విశేష అలంకరణలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు గానం చేశారు. అనంతరం తిరిగి స్వామి వారి ఉత్సవమూర్తులను శ్రీకోదండ రామాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మధుసూదన్, సుశీల బృందం చక్కటి సంకీర్తనలతో సుమధురంగా రామున్ని కీర్తించారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విభీషణ శర్మ, కోదండరామస్వామి ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశేషసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చక్రస్నానం..పులకించిన భక్తజనం



స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

- శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం ఉదయం పద్మ సరస్సులో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అశేష భక్తులు ఇదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించి, పునీతులయ్యారు. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. ఎనిమిది గంటలకు పల్లకిపై స్వామివారు మాడ వీధుల్లో విహరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు చక్రత్తాళ్వార్‌తో కలిసి ఊరేగింపుగా పద్మ సరస్సు వద్దకు చేరుకున్నారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చక్రత్తాళ్వార్, దేవదేవరులకు పాలు, పెరుగు, తేనె తదితరాల సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. 10.45 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి, చక్రత్తాళ్వార్‌కు అవభృథస్నానం చేయించారు. ఇదే సమయంలో భక్తులు సరస్సులో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

సాయంత్రం 7 గంటలకు విష్వక్సేనుడితో కలిసి స్వామి, అమ్మవార్లు మాడవీధి ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అంకురార్పణ సందర్భంగా ఆవాహనం చేసిన దిక్పాలకులకు ఉద్వాసన కార్యక్రమాన్ని పూర్తి చేసి, గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభం నుంచి అవరోహణం చేయించడంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. బ్రహ్మోత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించిన అర్చకులకు ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమాలను డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఇంజినీరింగ్ ఏఈ గురుప్రసాద్, అర్జితం అధికారి భరత్, షరాబ్ శ్రీనివాస షనాయ్, రూరల్ సీఐ భాస్కర్ నాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

అలరించిన అర్జున తపస్సు





తపస్సుమాను వద్ద సంతానం కోసం వరపడుతున్న మహిళలు(ఇన్‌సెట్‌లో) తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు పాయికట్టు అంకనపల్లెలో జరుగుతున్న ద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు నాటకం భక్తులను ఆకట్టుకుంది. వేకువజామున అర్చకులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ద్రౌపదీదేవి, శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి పద్యాలను ఆలపిస్తూ తపస్సుమాను అధిరోహించారు. ఈ క్రమంలో తీసుకెళ్లిన విబూధి, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు సంతానం కోసం తపస్సుమాను వద్ద వరపడి స్వామివారిని వేడుకున్నారు. అర్జునతపస్సు ఘట్టాన్ని భాగవతారిణి హరికథాగానం చేశారు. కార్యక్రమానికి ఉభయదారులుగా వీవీ పురం గ్రామానికి డిసెంబర్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగ రెడ్డి, కమిటీ సభ్యులు రామనాథరెడ్డి, దాము ఆచారి, నటరాజ్ ఆచారి, మణి, జనార్ధన్ పాల్గొన్నారు.

ముగిసిన బాటగంగమ్మ కొలుపు



రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తున్న గ్రామస్తులు



పురవీధుల్లో ఊరేగుతున్న బాటగంగమ్మ

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కన్నికాపురంలో ఉన్న బాటగంగమ్మ ఆలయంలో జరుగుతున్న కొలుపు బుధవారంతో కోలాహలంగా ముగిసింది. ఉదయం అర్చకులు అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, నెయ్యి, తేనెతో అభిషేకాలు చేశారు. కంకణం కట్టుకున్న భక్తులు తొమ్మిది బావుల్లో స్నానమాచరించి, అమ్మవారి గెరిగెను గ్రామాల్లో ఊరేగించారు. మధ్యాహ్నం గ్రామస్తులు అమ్మవారి పూజకు కావాల్సిన పట్టువస్త్రాలు, వివిధ సుగంధ పుష్పాలు, పూజా సామగ్రిని పంబ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు పంచామృతం, తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం కంకణం కట్టుకున్న భక్తులు అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి కన్నికాపురం, రామలింగాపురం, వీర్లగుడి గ్రా మాల్లో ఊరేగించారు. ప్రతి ఇంటా మహిళలు అమ్మవారికి కర్పూర హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు



నింద్ర: సర్వే చేస్తున్న సహిత ఉపాధ్యాయులు



వేల్కూరు ఇందిరా నగర్ కాలనీలో సర్వేలో పాల్గొన్న భవిత టీచర్లు పుష్పావతి, వరదారెడ్డి

నింద్ర: మండలంలోని అగరంపేటలో బుధవారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించారు. పిల్లలను భవిత పాఠశాలలో చేర్పించాలని తల్లితండ్రులను కోరారు. మే ఒకటి నుంచి జూన్ 9 తేదీ వరకు జిల్లాస్థాయిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించనున్నట్లు ఎంఈఓలు వసుమతీదేవి, శ్రీధర్ రాజు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో సర్వే చేసి, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తామన్నారు. భవిత ఉపాధ్యాయులకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు సర్వేకు సహకరించి, విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు వేంకటేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

వేల్కూరులో..

గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఇంటింటి సర్వే ద్వారా గుర్తిస్తున్నామని భవిత కేంద్రం టీచర్లు పుష్పావతి, వరదారెడ్డి తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో భాగంగా బుధవారం వేల్కూరు పంచాయతీలో సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తల్లిదండ్రులు టీచర్లకు సహకరించి, సర్వేని విజయవంతం చేయాలని కోరారు. భవిత కేంద్రం తరపున సర్వే ద్వారా నమోదు చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక అవసరాలు గల పిల్లలుకు వివిధ రకాల ఉచిత పరికరాలను అందజేస్తారని తెలిపారు. ఈ క్రమంలో అర్హులందరూ తప్పనిసరిగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

పెద్దశేషుడిపై వేణుగోపాలుడి చిద్విలాసం

- అట్టహాసంగా సంతాన వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేసిన వేదపండితులు
- నేడు చిన్న శేషవాహనంపై విహరించనున్న వేణుగోపాలుడు



పెద్దశేషవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాల స్వామి

కార్వేటినగరం: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేడుకగా ధ్వజారోహణం జరిగింది. ఉదయం ఐదు గంటలకు స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు, అభిషేకం, శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం, అర్చన, పుణ్యాహవచనంతో ప్రారంభించారు. తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. 6 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడుతో కలసి మాడవీధుల్లో ఊరేగింపునకు బయలుదేరారు. లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి విశ్వక్సేనుడు అష్ట దిక్పాలకులను ఆహ్వానించి ఆలయ మాఢవీధుల్లో నిర్వహించే కార్యక్రమాన్ని కంకణ భట్టాచార్యులు గోపాలచారి చేపట్టారు. అనంతరం 10 గంటల నుంచి 11 గంటల మధ్య కర్కాటక లగ్నంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ గరుడాళ్వార్ చిత్రపటం ఉన్న వస్త్రంతో పాటు పూలమాలలను జోడించి ఆలయంలోని ధ్వజస్తంభాన్ని అధిరోహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటలకు మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలున్ని పట్టు వస్త్ర సుగంధభరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం కనుల పండువగా ఊంజల్‌సేవ నిర్వహించారు.

పెద్దశేషవాహనంపై వేణుగోపాలుడు..

వార్షిక బ్రహ్మత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం రాత్రి ఉభయ నాంచారులతో పాటు శ్రీవేణుగోపాలుడు పెద్దశేషవాహనంపై కోలాటాలు, చెక్కభజనలు, బాజాభజంత్రీల మధ్య పురవీధుల్లో దర్శనమిచ్చారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం 9.45 గంటలకు వేదపండితులు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టు నారాయణ దాశరథి, వేద పండితులు గోపాలాచారి, తరుణ్‌కుమార్, పలువురు వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు. గురువారం ఉదయం స్వామివారు ఉభయ దేవేరులతో పాటు చిన్నశేష వాహనంపై పురవీధుల్లో ఊరేగనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే నిత్యకైంకర్యాలు నిర్వహించి రాత్రికి హంసవాహనంపై స్వామివారు విహరించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.



కార్వేటినగరం: వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు

అలరించిన సంగీత కచేరీ..

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. స్వామివారికి వివిధ రకాలైన భక్తి గీతాలను ఆలపించి స్వామివారిని పరవశింపజేశారు.